క్లుప్తంగా

కొబ్బరికాయల స్టాండ్ సమర్పణ



కొబ్బరికాయలు కొట్టే స్టాండ్‌తో దాత

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయానికి కొబ్బరికాయలు కొట్టే స్టాండ్‌ను దాత గంజి నరసింహారావు (బూరయ్య) సమర్పించారు. ఇప్పటి వరకు ఇనుప స్టాండ్ల వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేవారు. ఆ సమయంలో నీళ్లు కిందపడి వృథా అయ్యేవి. ఈ క్రమంలో స్టీల్ స్టాండ్‌ను దాత తయారు చేయించారు. రూ.10 వేల విలువైన స్టాండ్‌ను శుక్రవారం ఆలయానికి అందజేశారు.

మత్స్యకారులకు చిక్కిన మత్స్య సంపద



మత్స్యకారులు పట్టుకున్న చేపలు

కొత్తపల్లి: అమీనాబాద్ శివారు చేపలరేవులో శుక్రవారం మత్స్యకారులకు చిక్కిన భారీ మత్స్య సంపదతో కిటకిటలాడింది. బోట్లపై వేటకు వెళ్లగా మత్స్యకారులకు సుమారు 3 టన్నులు చేపలు లభించాయి. రూ.10 లక్ష విలువ చేసే చేపలు వలలకు చిక్కాయి. ఈ చేపలను వ్యాపారులు కొనుగోలు చేసి తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నామని వారు తెలిపారు.

సినిమాలు



పిఠాపురం	
వెంకటేశ్వర థియేటర్:	క
సత్య:	కంగువ
అన్నపూర్ణ:	అమరన్
పూర్ణ:	మట్కా
ఉప్పాడ	
శ్రీనివాస థియేటర్:	క
పెద్దాపురం	
వీరభద్ర:	కంగువా
శ్రీలలిత-1:	మట్కా
శ్రీలలిత-2:	లక్కీ భాస్కర్
శోభా:	అమరన్
సామర్లకోట	
అనుశ్రీ-1:	మట్కా
అనుశ్రీ-2:	అమరన్
విఘ్నేశ్వర:	కంగువా

ప్లాస్టిక్‌పై కవరు గాని నిషేధం

- యథేచ్ఛగా అమ్మకాలు
- పర్యావరణానికి తప్పని ముప్పు
- పట్టించుకోని అధికారులు

పిఠాపురం: ఏ రోడ్డుపై చూసినా ఏ డ్రైనులో చూసినా ప్లాస్టిక్ చెత్తే దర్శనమిస్తోంది. గతంలో ప్లాస్టిక్ వినియోగం తక్కువగా ఉన్నప్పుడు డంపింగ్ యార్డులలో చెత్త ఇంకిపోతు ఎన్ని టన్నులు వేసినా ఎరువుగా మారుతుండేది. కానీ ప్రస్తుతం ప్లాస్టిక్ చెత్త వల్ల ఎరువులకు బదులు కాలుష్యం కన్నెర్ర చేస్తోంది. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి పెను ముప్పుగా తయారైందని జిల్లా ఉన్నతాధికారులు వాటి వినియోగాన్ని నిషేధించారు. ఈ నిషేధం ఆరంభసూరత్వం తప్ప అమలు కావడం లేదు. దీంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. కొన్ని రోజులు హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో వాటి అమ్మకాలు వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. అతి చౌకగా సునాయాసంగా వాడుకలోకి వచ్చిన ప్లాస్టిక్ సంచుల వినియోగం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్లాస్టిక్ సంచులు వినియోగంపై నిషేధం విధించినప్పటికీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో నిషేధం నీరుగారుతోంది. కఠిన నిర్ణయాలతో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పర్యావరణ వేత్తలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు.



ఎక్కడ చూసినా ఇలా ప్లాస్టిక్ సంచులే..

భూమిలో కలవక..

పట్టణ ప్రాంతాల్లో రోజు టన్నులకొద్ది ప్లాస్టిక్ సంచులు డంపింగ్ యార్డుకు చేరుతున్నాయి. సాధారణ చెత్తా చెదారం కొన్ని రోజులకు భూమిలో ఇంకిపోయి పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడేలా ఉండేవి. అయితే ప్లాస్టిక్ సంచులు మాత్రం సంవత్సరాల తరబడి ఏ మాత్రం పాడవకుండా భూమిలో ఇంకిపోకుండా ఉండిపోతుండడంతో కాలుష్యం కారుమబ్బులా కమ్ముకొస్తోంది. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధం విధించింది. కానీ ఈ నిషేధం ప్రకటనలకు తప్ప ఆచరణలో మాత్రం సాధ్యం కావడంలేదు.

టన్నుల కొద్దీ ప్లాస్టిక్ చెత్త

పిఠాపురం పట్టణ పరిధిలో సుమారు 70వేలకు పైగా జనాభా ఉండగా ప్రతిరోజు సుమారు 32 టన్నులకు పైగా చెత్త తయారవుతోంది. పట్టణ ప్రజలతోపాటు పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని వేలాది మంది ప్రజలు ప్రతి రోజు వివిధ అవసరాల కోసం పట్టణానికి వచ్చి పోతుంటారు. తద్వారా ప్లాస్టిక్ సంచుల విక్రయం విచ్చలవిడిగా జరుగుతుంది. పిఠాపురం పట్టణ పరిధిలో ప్రతిరోజు మూడు లక్షలకుపైగా ప్లాస్టిక్ సంచులు అమ్మకాలు జరుగుతున్నట్టు అంచనా పట్టణ పరిధిలో పలు హోల్‌సేల్, చిల్లర దుకాణాలు ప్లాస్టిక్ సంచులను విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులతో పాటు గ్లాసులు వినియోగం ఎక్కువగా పెరిగింది. వీటిని నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ అమలు చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు.

డ్రైన్లను ముంచెత్తుతూ..

సామాన్యుల దగ్గర నుంచి ధనవంతుల వరకూ ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం పెరిగింది. ఇది ప్రమాదమని తెలిసినప్పటికీ ప్రజల్లో చైతన్యం మాత్రం కనిపించలేదు. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వినియోగించి రోడ్లపై పడేయడంతో అవి మట్టిలో కలవక కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. దీనికి తోడు వినియోగదారులు మార్కెట్లలో కూరగాయలు, చేపలు, మాంసాలు వంటి వాటిని ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొని వచ్చి డ్రైన్లలో పడవేస్తున్నారు. దీనికి కారణంగా డ్రైన్లలో మురుగునీరు ప్రవహించని పరిస్థితి ఏర్పడుతోంది.

చర్యలు తీసుకుంటున్నాం

ఇప్పటికే వ్యాపారస్తులతో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ సంచులను అమ్మడం కొనడం నిలుపుదల చేయాలని ఆదేశించాము. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని దుఖాణాల్లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకున్నాం. దుఖాణాలను తనిఖీలు చేయడానికి ఏర్పాట్లు చేసాం. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం.

– కనకారావు, మున్సిపల్ కమిషనర్, పిఠాపురం

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీవైఈఓ

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో రాణించాలని డీవైఈఓ ప్రభాకర శర్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్థానిక శాఖా గ్రంథాయలంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుల పుస్తక ప్రదర్శన, దేశభక్తి గీతాలాపన నిర్వహించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు, అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. విద్యార్థులు టీవీ మాధ్యమాల నుంచి పుస్తక పఠనం వైపు మళ్లించేందుకు గ్రంథాలయ వారోత్సవాలు దోహదపడతాయన్నారు. జ్యోస్యుల కృష్ణబాబు, గ్రంథాలయాధికారి నాగరాజు మాట్లాడుతూ, విద్యార్థికి పుస్తకమే మంచి స్నేహితుడన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, గ్రంథాలయ ఉద్యమకారుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు., అనంతరం పుస్తక ప్రదర్శనను డీవైఈఓ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపధ్యాయులు ఎస్.గోపాలకృష్ణ, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ దృష్టికి విగ్రహాల సమస్య



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న హరిబాబు, నరేష్

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని గతంలో కౌన్సిల్ తీర్మానం చేసినా, ఏర్పాటు చేయడం లేదని సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అదే ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారని హరిబాబు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి సామర్లకోట పట్టణ సమస్యలు వివరించినట్టు ఇదే రోజు రాత్రి హరిబాబు ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఎస్సీ నాయకులపై పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని అధినేత దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు ఎలిశెట్టి నరేష్ కూడా ఉన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



సామర్లకోట గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన


సామర్లకోట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయంలో జాతీయ నాయకులు, సాంకేతిక పరిజ్ఞానం, చారిత్రక, ఆధ్యాత్మిక అంశాలకు సంబంధించి తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో 18 వేల పుస్తకాలు ఉన్నట్లు గ్రంథాలయాధికారి బందిల రత్నమణి తెలిపారు. గ్రంథాలయంలో సభ్యత్వం కలిగిన వారు పుస్తకాలను ఇళ్లకు తీసుకెళ్లే సదుపాయం ఉందని చెప్పారు. శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. జూనియర్ విభాగంలో పుస్తక పఠన ఆవశ్యకత, సీనియర్ విభాగంలో సెల్‌ఫోన్ అతి వాడకం-దుష్పలితాలు అనే అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. అలాగే ఆదివారం చిత్రలేఖన పోటీల్లో జూనియర్ విద్యార్థులకు గ్రామీణ వాతావరణం, సీనియర్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశాలపై పోటీలు ఉంటాయని వివరించారు.

అలజడి

- ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు
- కోతకు గురవుతున్న తీరం
- భయాందోళనలో మత్స్యకారులు



ఉప్పాడలో సముద్ర గర్భంలో కలుస్తున్న తీరం



ఉప్పాడలో ఇళ్లలోకి చొచ్చుకొస్తున్న సముద్ర కెరటాలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కడలి కల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తిన ఎగసిపడుతున్నాయి. తీరం కోతకు గురవుతోంది. దీంతో మత్స్యకారులు భయాందోళనకు గురవుతున్నారు. ఉప్పాడ తీరంలో ఉన్న సురడపేట, జగ్గారాజుపేట, మయపల్నంలో మత్స్యకారుల గృహాలు కళ్లెదుటే ఎగసి పడుతున్న అలలకు కడలిలో కలిసిపోతున్నాయి. గత రెండు రోజులుగా అల్పపీడనం ప్రభావంతో మండలంలోని తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, కోనపాపపేటల్లో కడలి కల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతుండడంతో ఉప్పాడ తీరప్రాంతాల్లో ఉన్న ఇళ్లు కోతకు గురవుతున్నాయి. గృహాలతో పాటు వృక్షాలు, రోడ్లు, సముద్ర గర్భంలో కలుస్తున్నాయి. దీంతో మత్స్యకారులు గృహాలను విడిచి సామగ్రితో సురక్ష ప్రాంతాలకు తరలి వెళుతున్నారు.

బీచ్ రోడ్డులో ఎగసి పడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ప్రభావంతో సముద్రపు అలలు ఎగసి పడుతున్నాయి. బీచ్‌రోడ్డులో రక్షణగోడగా వేసిన బండరాళ్ల గోడను సైతం కెరటాల కదిలిస్తున్నాయి. అలల ఉధృతికి రాళ్లు రోడ్డుమీదకు వచ్చి పడుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో బీచ్ రోడ్డు మీదకు కెరటాలు ఎగసి పడుతుండడంతో పోలీసులు బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మాండవ్య నారాయణుడి గ్రామోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణ స్వామి గ్రామోత్సవం



హుస్సేన్‌పురంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: గోదావరి నదితీరాన ఉన్న పురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం శుక్రవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం ప్రారంభించారు. ఆలయం వద్ద ఉన్న కాలిబాట వంతెన మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీది, యార్లగడ్డవారివీధి, మఠం సెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం కొనసాగింది. భక్తులు స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

హుస్సేన్‌పురంలో..

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో ఉన్న అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారి గ్రామోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఆలయంలో కార్తిక మాస ఉత్సవాల్లో భాగంగా, కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ నాయకుడు చల్లా బుజ్జి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గ్రామ పురవీధుల మీదుగా గ్రామోత్సవం కొనసాగింది.

అమర వీరుల స్ఫూర్తితో పోరాడాలి

- ఏపీ రైతు కూలీ సంఘం నేత కర్నాకుల



అమరవీరుల సంస్మరణ ర్యాలీ నిర్వహిస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: దోపిడీ, పీడన, వివక్ష వంటి అసమానతలకు వ్యతిరేకంగా, అమరవీరుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతిని సందర్భంగా శుక్రవారం పులిమేరు దమ్ముపేటలో అమరవీరుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుంచే అంజిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వీరాంజనేయులు మాట్లాడారు. స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ అశేష ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నారన్నారు. దోపిడీ, పీడన, వివక్షను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రంలో ఆర్ఎస్ఎస్ ప్రోద్బలంతో బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు, నియంతృత్వ ధోరణిలో పాలన సాగిస్తోందన్నారు. దళితులు, ఆదివాసీలు, మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కులమతాలకు అతీతంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విప్లవ శక్తులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పెద్దాపురం ప్రాంతంలో వందల ఎకరాల భూదాన్ భూములను అధికారులు కాసులకు కక్కుర్తిపడి భూస్వాములు, పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నార్నారు. అర్హులైన పేదలకు ఆ భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వల్లూరి రాజుబాబు, డి.సురేష్, నాగేశ్వరరావు, తోట వీరబాబు, కోట అప్పలనర్స, వెంకటలక్ష్మి, సత్తిబాబు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర..!



దీపం దర్శయామి: దీపహారతి ఇస్తున్న భక్తుడు

- కిటకిటలాడిన ఆలయాలు
- కార్తిక పౌర్ణమితో భక్తుల సందడి



కార్తిక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు

పిఠాపురం: కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయం చేరుకుని పాదగయలో పుణ్య స్నానాలు చేసి ఉమా కుక్కుటేశ్వరస్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్తిక పౌర్ణమి కావడంతో ఉపవాసంతో ఉన్న భక్తులు ఉదయం నుంచి పుణ్య స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిళ్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. రాత్రి స్వామివారి జోలా తోరణం కనుల పండవగా నిర్వహించారు. స్థానిక పురుహూతిక అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు. గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలు శివ న్నామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో జ్వాలా తోరణాలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు.



పాదగయ పుష్కరిణిలో కార్తిక దీపాలు వదులుతున్న భక్తులు



తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం

పంచారామ క్షేత్రంలో పౌర్ణమి పూజలు

- బారులు తీరిన భక్తులు
- కొత్త దంపతులతో కళకళ



పంచారామ క్షేత్రంలో లక్ష పత్రి పూజలు చేస్తున్న భక్తులు



ధ్వజస్తంభం వద్ద ఆవు నెయ్యితో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: పవిత్రమైన పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా, హరహర మహాదేవ.. శంభో శంకరా అంటూ భక్తుల నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ భక్త సంఘ అధ్యక్షుడు బిక్కిన సాయి కుటుంబ సభ్యులు లక్షపత్రి పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయంలోని ధ్వజ స్తంభం, జమ్మి, తులసీ, మారెడు చెట్లతో పాటు, ఆలయమంతా దీపాలతో నిండిపోయింది. నవ దంపతులు కందమొక్క, గుమ్మడి కాయలతో స్వామివారికి స్వయం పాకం సమర్పించారు. దంపతులు వెండి, ఇత్తడి పళ్లాల్లో స్వయం పాకం ఉంచి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆకర్షణగా మారింది. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు అంజిబాబు, భాస్కర్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు ఆధ్వర్యంలో సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్త కమిటీ వారు భక్తులకు సేవలందించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం నుంచి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. విజయవాడ టౌన్ సీఐ ఆకుల మురళీకృష్ణ కుటుంబ సభ్యులు కార్తిక పౌర్ణమి పూజలు చేశారు. ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి అనేక మంది భక్తులు స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. సాయంత్రం మహిళలు చంద్రుడు వచ్చిన తరువాత తులసీ కోటల వద్ద అద్దంలో చంద్రుడిని దర్శించి, పూజలు చేశారు. నీటిలో కార్తిక దీపాలను వెలిగించారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

పంచారామ క్షేత్రంలో శుక్రవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ భక్త సంఘ అధ్యక్షుడు బిక్కిన సాయి కుటుంబ సభ్యులు లక్షపత్రి పూజలు చేయడంతో, వారి కోసం దీపారాధన సంఘ సభ్యులు రాత్రి జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. పూజల అనంతరం జ్యోతిర్లింగానికి పూజలు చేసి, దీపాలను వెలిగించారు. లక్షపత్రి పూజలు చేసిన కుటుంబ సభ్యులు దీపాలను వెలిగించగా, మిగిలిన వాటిని ఆలయానికి వచ్చిన భక్తులు వెలిగించడానికి పోటీ పడ్డారు. ధ్వజ స్తంభం వద్ద ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆకాశ దీపానికి పూజలు చేసి, ధ్వజ స్తంభం శిఖర భాగంలో ఏర్పాటు చేశారు.

ప్రత్యేకాలంకరణలో భీమేశ్వర స్వామి

పంచారామ క్షేత్రంలో ఉన్న కుమారారామ భీమేశ్వర స్వామిని, అమ్మవారిని శుక్రవారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించారు. లక్షపత్రి పూజల్లో భాగంగా స్వామివారికి బిల్వార్చన చేశారు. కార్తిక పౌర్ణమి కావడంతో స్వామివారి అలంకరణను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవిని బంగారు కిరీటం, బంగారు ఆభరణాలతో అలంకరించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కొత్తపల్లి: మండలంలో కార్తిక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ఉన్న బాలాత్రిపుర సుందర రాజశేఖరస్వామి ఆలయం, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీధర్మ శాస్త్రా, ఉప్పాడలో ఉన్న ఉమాలింగేశ్వస్వామి ఆలయం, మత్స్యలింగేశ్వరస్వామి ఆలయం చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: శివనామ స్మరణతో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శైవ క్షేత్రాలు మార్మోగాయి. శుక్రవారం కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శివాలయం, తిరుపతి శృంగార వల్లభుడి ఆలయం, పాండవుల మెట్టపై ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయాలతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు హర హర శివ శంకర జపంతో స్నానమాచరించి. భక్తిశ్రద్ధలతో కార్తిక నోములను నోచుకున్నారు.

మరిడమ్మ ఆలయంలో..

కార్తిక పౌర్ణమి సందర్భంగా స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో కార్తిక దీపాలంకరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారి చండీ హోమం వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాత్రి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణ చేయగా, భక్తిశ్రద్ధలతో భక్తులు దీపాలను వెలిగించారు.



పంచారామ క్షేత్రంలో తులసి మొక్క వద్ద దీపాలు పెడుతున్న మహిళలు



చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



కొత్తపల్లిలోని ఓ ఇంటిలో చేసిన కేదారేశ్వర స్వామి పూజ